ప్రజాశక్తి
www.prajasakti.com
ఆదివారం 29 జూన్ 2025
5
అన్నమయ్య



ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఊటుకూరు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మన్నేరు లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో శనివారం ఊటుకూరు సచివాలయం నందు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పంచాయతీలోని అన్ని గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తపోటు, మధుమేహం తదితర వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మన్నేరు లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ పేద ప్రజల మెరుగైన ఆరోగ్యం కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే చికిత్స అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. రమాదేవి ఆసుపత్రి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఊటుకూరు సర్పంచ్ ఈశ్వరయ్య, జనసేన నాయకులు కె.ఎస్ నరసింహ, పి.సుధాకర్, ఉదయగిరి రమణ, కారుమంచి శివయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల
దోపిడీ




జిల్లాలో ప్రతి ఏడాది జూన్, జులై మాసం వచ్చిందంటే ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలో పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, బూట్లు, టై తదితర కిట్ల పేర్లతో వసూళ్ల పండగ ప్రారంభం అవుతుంది. అన్నమయ్య జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. ప్రయివేట్ విద్యా సంస్థల్లో నిబంధనలను గాలి వదిలేశారు. ప్రయివేట్ పాఠశాలలన్నీ వ్యాపార సంస్థలుగా మారిపోయాయి. ఒకవైపు ఫీజులు, మరోవైపు వాటి పుస్తకాల యూనిఫాం పేర్లతో తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి తమ పాఠశాలలోనే కొనాలి, బయట కొనకూడదు అని నిబంధనలు పెట్టి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రయివేట్ పాఠశాల ఆగడాలను అరికట్టాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

- వ్యాపార కేంద్రాలుగా విద్యా సంస్థలు
- యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫామ్ విక్రయాలు
- ఇష్టారాజ్యాంగా వేలకు వేలు ఫీజు వసూలు
- పట్టని విద్యా శాఖ అధికారులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో 94,903 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో నోటీసు బోర్డు వివరాలు ఏర్పాటు చేయాలని ప్రతి ఏడాది ఉన్నతాధికారుల సూచించి నప్పటికీ జిల్లా వ్యాప్తంగా ఏ పాఠశాలలో కూడా అవి అమలు చేయకపోవడం శోచనీయం. యూనిఫామ్, పాఠ్య, నోట్ పుస్తకాలు, బెల్టు, బూట్లు, టై, ఐడి కార్డ్ పేర్లతో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. దీనిపై విద్యా శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడిచినప్పటికీ పుస్తకాలు, యూనిఫాం పేరిట రూ. 10 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. ఒకటి నుండి 10వ తరగతి వరకు వేల రూపాయలు యాజమాన్యాలు వసూలు చేస్తున్నా విద్యా శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎల్‌కెజి, యుకెజి పేరిట భారీ మొత్తంలో ప్రయివేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. కేవలం నర్సరీకే రూ.15 వేలు వసూలు చేస్తే, పై తరగతులకు ఫీజులు మాత్రం ఏ స్థాయిలో వసూలు చేస్తారో అర్థం చేసుకోవచ్చు.



పాఠ్యపుస్తకాలు అమ్మకాల జోరు..

ప్రయివేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అమ్మబడును అన్నట్లుగా యాజమాన్యం జోరుగా పార్టీ పుస్తకాలను అమ్ముతున్నారు. నర్సరీ రూ.4 వేలు, ఎల్‌కెజి, రూ. 5 వేలు, యూకేజీ రూ. 6 వేలు, 1వ తరగతి రూ .6 వేలు, రెండవ తరగతి రూ .6500, మూడవ తరగతి రూ.7 వేలు నాలుగో తరగతి రూ .7300 వందలు, 5వ తరగతి రూ.7500, ఆరవ తరగతి రూ .8 వేలు, 7వ తరగతి రూ .8500, 8వతరగతి రూ.9700, 9వ తరగతి రూ .10500 పదవ తరగతి రూ .12 వేలు రూపాయలకు పుస్తకాలను జోరుగా అమ్ముతున్నారు.

రాయచోటిని జిల్లా చేసి మూడేళ్లు పూర్తి కావడంతో ఇది అదునుగా భావించిన యాజమాన్యాలు అధికంగా ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలలను వ్యాపార సంస్థలుగా మార్చేశారు. కార్పొరేట్ యాజమాన్యాల తీరుతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఎక్కువ మంది తల్లితండ్రులు ప్రయివేట్ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. విద్యా బోధనలు, క్రమశిక్షణ, మెరుగైన సేవలందించడంలో ఏ ప్రయివేట్ పాఠశాలలో సరైన పద్ధతి అవలంభిస్తారని భావించి ఎక్కువగా తల్లిదండ్రులు ప్రయివేట్ పాఠశాలల వైపే వెళ్లడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలలో మాత్రం కొన్ని ప్రాంతాల్లో సరైన వసతులు లేక పోవడం వల్ల తల్లిదండ్రులు ప్రయివేట్ పాఠశాలల వైపే వెళుతున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యమే ప్రయివేట్ పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదు. ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఇదిలా ఉంటే జిల్లాలో కొన్ని పాఠశాలలకు అనుమతులు కూడా లేవు. వాటిపైన విద్యా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. కొంత మంది ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు అనుమతి నిబంధనలు పాటించని పాఠశాలలు నిర్లక్ష్యంగా విద్యా శాఖ అధికారులు ఆందోళనలో తల్లిదండ్రులు తెచ్చుకొని 7వ తరగతి వరకు కూడా విద్యా బోధనలు అందించే పరిస్థితి కనపడుతుంది. మరి కొన్ని పాఠశాలలు సరైన ఆట స్థలం, పాఠశాల అనుమతులు లేనట్లు తెలుస్తుంది. దీనిపైన విద్యా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెడితే తప్ప జిల్లాలో ఉండే ప్రయివేట్ పాఠశాలలు, ఇష్టానుసారంగా వ్యవహరించే పరిస్థితి కనపడుతుంది. ఇప్పటికే పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన పాఠశాలలపై చర్యలు తీసుకో వాలని పలువురు కోరుతున్నారు.

ఫీజులను నియంత్రించాలి

ప్రయివేటు పాఠశాలలో పిల్లలను చదివించాలంటే భయమేస్తుంది. ప్రతి ఏడాది జూన్‌లో పాఠశాలలో ప్రారంభమవుతాయి. పిల్లలకు పాఠశాలలో ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్, మెస్, బస్సు ఫీజు ఇతర వస్తువులపైన అధిక రేట్లు యాజమాన్యం వసూలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అధిక ఫీజులు, పాఠ్య పుస్తకాల రేట్లను నియం త్రించాలని కోరుతున్నాం.



\- ఎ.రెడ్డెయ్య, విద్యార్థి తండ్రి, రాయచోటి.

చర్యలు తీసుకోవాలి..

కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు ఎక్కడ కూడా చర్యలు తీసుకోవడం లేదు. జీవో నెంబర్ 41 ప్రకారం ఏ ఒక్క పాఠశాలలో పాఠ్యపుస్తకాలు కానీ, స్టేషనరీ కాని విక్రయించరాదని ఉన్నప్పటికీ, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం అధిక రేట్లకు అమ్ముతుంది. ఇతర జిల్లాల్లో జిల్లా విద్యాశాఖ అధికారుల స్వయంగా పరివేక్షించి వాటిపైన చర్యలు తీసుకుని పార్టీ పుస్తకాల సీజ్ చేస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలకు కొమ్ముకాయడం విచారకరం. విచారణ జరిపించాలని పత్రిక ప్రకటన ద్వారా విద్యార్థి సంఘాలు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు ఫీజు నియంత్రణ పాఠ్యపుస్తకాలు అమ్మకుండా చర్యలు తీసుకోవాలి.



\- సర్వేపల్లి నరసింహ, జిల్లా అధ్యక్షులు, ఎస్ఎఫ్ఐ, అన్నమయ్య జిల్లా,

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, పుస్తకాలు అమ్ముతున్నారని మాకు ఇంత వరకు ఎవరు ఎటు వంటి ఫిర్యాదు చేయలేదు. తల్లిదండ్రులు ఎవరైనా ప్రయివేట్ పాఠశాలలో అధిక ఫీజులు, పుస్తకాల పైన అధిక రేట్లు తీసుకుంటున్నారని ఫిర్యాదు చేస్తే కఠినచర్యలు తీసుకుంటాం. ఇటీవల కాలంలో ప్రయివేట్ కరస్పాండెంట్‌లతో సమావేశం కూడా నిర్వహించాం.



\- సుబ్రహ్మణ్యం, డిఇఒ, అన్నమయ్య జిల్లా

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఏళ్ల తరబడిగా కార్మిక వర్గం సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ తెచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని జిల్లాలోని కార్మిక వర్గ శ్రేణులకు వ్యవసాయ కూలీలకు, రైతాంగానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా విస్తృత స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహించి, ఆయుధాలు అమ్ముతూ అమెరికా తన సామ్రాజ్యవాదం విస్తరించడానికి యత్నిస్తోందన్నారు. దేశాల మీద విచ్చల విడిగా సుంకాలు విధిస్తూ దోపిడీ చేస్తున్న ట్రంపు మెప్పు కోసమే మనదేశంలో ప్రధాని మోడీ కార్మిక వర్గం మీద భారాలు వేస్తూ లేబర్ కోడ్లు తెస్తున్నారని చెప్పారు. వ్యవసాయ నల్ల చట్టాలు అమలు చేస్తూ పర్మినెంట్ ఉద్యోగాలను రద్దు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరణ చేయడంలో భాగంగా విశాఖ ఉక్కు లాంటి సంస్థలో కార్మికులను తొలగించారని చెప్పారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపి నోరు మెదపకపోవడం దారుణమన్నారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగా లేకుంటే సంపద సృష్టించడానికి పరిశ్రమలు వ్యవసాయం ఆధారంగా ఆర్థిక సంపద పెంచాలని అన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో కొత్త రంగాలకు విస్తరించి కార్మిక వర్గ విస్తరణకు కృషి చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగం రాష్ట్ర కార్యదర్శి పి. శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల పనిగంటలు పెంచి ,జీతం పెంచక పోవడం దారుణమని రాష్ట్రంలో లేబర్ కోడ్లు రద్దు చేయకుండా కేబినెట్ మీటింగ్‌లో 8 గంటలు ఉన్న పని 12 గంటలు పెంచి మహిళకు రాత్రి డ్యూటీలు వేయడం అంటే కట్టు బానిసలుగా మార్చడమేనని అభిప్రాయపడ్డారు. విజన్-2047 భూటకమని తెలిపారు. కార్మికుల చట్టాల రక్షణ కోసం నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో ప్రతి ఒకరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ జులై 9 సమ్మెకు సంబంధించి విస్తృతప్రచారాలు, కరపత్రాల పంపిణీ బైక్ ర్యాలీ, గేట్ మీటింగులు పెట్టి కార్మికులను చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు రమేష్ బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి యస్. రామచంద్ర, సిఐటియు జిల్లా అధ్యక్షులు సి. హెచ్.చంద్రశేఖర్, సిఐటియు ఆఫీస్ బేరర్స్ రవికుమార్, భాగ్యలక్ష్మి రాజేశ్వరి, వెంకట్రామయ్య, సురేంద్ర బాబు, శ్రీలక్ష్మి ఓబుళమ్మ, మెహరున్నిసా, రైతు సంఘం బసిరెడ్డి ఈశ్వరయ్య, ఎల్ఐసి నాయకులు అది నారాయణరెడ్డి, సమగ్రశిక్ష నాయకులు మురళి, జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : పిసిసి


సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి రాహు, కేతువులని పిసిసి అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శనివారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా మార్చి అధోగతి పాలు చేసిందన్నారు. వైసిపి వైఫల్యం, టిడిపి ఇచ్చిన హామీలతో కూటమి ప్రభుత్వం నేడు అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఏడాది దాటినా కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలలో నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పెన్షన్ హామీలను ఎప్పటినుండి అమలు చేస్తారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చేందుకు సూపర్ సిక్స్ హామీలు ప్రధాన కారణమన్నారు. సంవత్సరం దాటినా వీటిలో చాలామటుకు అమలు కావడం లేదన్నారు. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు 3 పైసలు ఇవ్వలేదని విమర్శించారు. ఆడ బిడ్డ నిధి కింద 19-59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు 15 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం ఆ ఊసే లేదన్నారు. ముఖ్యమంత్రి యువతను, ఆడబిడ్డలను, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలను నమ్మించి మోసగించడం న్యాయం కాదని పేర్కొన్నారు. రాజంపేట నియోజకవర్గానికి ఇచ్చిన హామీలలో అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణం, తదితర హామీలు గాలికొద్దిలేశారని ఆరోపించారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూలభాస్కర్, అత్తింజేరి శ్రీనాథ్, రాజంపేట, ఒంటిమిట్ట మండలాల అధ్యక్షులు మహాదేవయ్య, గురవయ్య, సేవాదళ్ అధ్యక్షులు విజయకుమారి, శివయ్య నాయుడు, నాగూరు, అమర్ నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, శేఖర్ పాల్గొన్నారు.

పొలానికి రహదారి చూపండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో 224 సర్వే నెంబర్‌లో తన పూర్వీకుల నుండి సంక్రమించిన పొలంలో ఎన్నో సంవత్సరాలుగా పంటలు వేసుకుంటూ జీవనం సాగిస్తుంటే శుక్రవారం కొంతమంది తన పొలంలోకి రహదారిలేదని దాడి చేసి గాయపరిచారని రైతు జగదాబి నాగేశ్వరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా తన పొలానికి రహదారి లేకుండా చేయాలని దురుద్దేశంతో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి తనకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. తనకు ఆధారంగా ఉన్న పొలానికి వెళ్లేందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. గతంలో ఈ రహదారి విషయంలో అనేకసార్లు ఘర్షణలు జరిగాయని, కోర్టు పరిధిలో ఈ సమస్య ఉన్నప్పటికీ మరల తనపై దాడికి పాల్పడ్డారన్నారు. గతంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి నిర్దేశించినప్పటికీ తనను అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ విషయంపై కోర్టులో తన వైపే అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. తన జీవనాధారం వ్యవసాయమేనని, దానిపైనే కుటుంబ పోషణ జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి తన పొలానికి రహదారి చూపాలని, తనపై దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.

త్వరలో అందుబాటులోకి అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-పీలేరు


స్థల పరిశీలన చేస్తున్న చైర్మన్ బృందం

పీలేరు ప్రజలకు త్వరలో అన్న క్యాంటీన్ అందుబాటులోకి తీసుకు రానున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి తెలిపారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు శనివారం మండల సర్వేర్లు ప్రబంధ, వినోద్ కుమార్, ఎంపిసి చైర్మన్ పురం రామ్మూర్తితో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి రూ.5 కే నాణ్యమైన భోజనం అందిస్తూ అందరి కడుపు నింపడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లను అందరికీ అందుబాటులో తెస్తున్నట్లు తెలిపారు. 2014-2019 మధ్యకాలంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లు నిర్వహించారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని మూసివేసిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ తిరిగి అన్న క్యాంటీన్లు పునః ప్రారంభించి ప్రజలందరికీ నాణ్యమైన పౌష్టిక ఆహారం అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి హరినాథ్, డైరెక్టరు ఖాదర్, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఛార్జీలు చెల్లించొచ్చు

ప్రజాశక్తి - రాయచోటి

గృహ విద్యుత్ వినియోగదారులు తమ సర్వీసులకు అడిషనల్ లోడ్ కలిగి ఉంటే వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి 50 శాతం రాయితీతోకూడిన డెవలప్‌మెంట్ ఛార్జీలను చెల్లించడానికి సోమవారం వరకు మాత్రమే అవకాశం ఉందని, జిల్లాలోని విద్యుత్ వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పర్యవేక్షణాధికారి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని విద్యుత్ వినియో గదారులు ఆదివారం రోజు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించడానికి అవకాశముందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

చెవిలో పువ్వులు పెట్టుకుని కార్మికుల నిరసన

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన వేతనం మాదిరిగానే ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా 25వ రోజు చెవిలో పువ్వులు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 25 రోజులుగా సమ్మె చేస్తున్నా, నిన్నటి దినం విజయవాడలో సిడిఎంఎ ఆఫీసును కార్మికులు ముట్టడించినప్పటికీ తమ సమస్యలను పట్టించుకోకుండా వివిధ కారణాలు చెప్పి మాకు చెవిలో పూలు పెట్టారని, అందుకే తాము కూడా చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలుపుతున్నామన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా తమ న్యాయమైన డిమాండ్లు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. అలా చేయని పక్షంలో రాష్ట జెఎసి పిలుపు మేరకు శనివారం రాత్రి నుండి వీధిలైట్లను నిలుపుదల చేస్తామన్నారు. కార్పొరేట్లకు లాభాలు చేకూర్చడం కోసమే లేబర్ కోట్లు తీసుకురావడం పని గంటలు పెంచడం జరుగుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలు వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. సమస్యలను పరిష్కారం కానిపక్షంలో సిఐటియు సంఘాలను కలుపుకొని, మేధావులు ప్రజలతో మమేకమై ఉధృతం చేస్తామన్నారు. 30వ తేదీ నుండి నీటి సరఫరా బంద్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ జెఎసి నాయకులు ఎస్.కె రెడ్డప్ప, నాగరాజు, బాబు, బాలకృష్ణ, గోపాలకృష్ణ, సజాద్, కుమార్, రాజేశ్వరి, కన్నయ్య, ఇంజనీరింగ్ శాఖ కార్మికులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యమే దేశ సౌభాగ్యం

ప్రజాశక్తి-పీలేరు: దేశ సౌభాగ్యం చిన్నారుల ఆరోగ్యంతో ముడిపడి ఉందని డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. రాష్ట్రీయ బాల ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా శనివారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎంలు, సిహెచ్ఒలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు త్వరలో నిర్వహించనున్న ఇంటింటి సందర్శన కార్యక్రమంలో నిబంధనల మేరకు చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే ఆరోగ్య లోపాలు, వ్యాధులను గుర్తించి, వారికి మెరుగైన సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు, మెరుగైన చికిత్సల కోసం ఉన్నతస్థాయి ఆసుపత్రులకు రెఫరల్ చేయడం జరుగుతుందన్నారు. అందరి సహకరలతో ఆరోగ్య సమస్యలు లేని చిన్నారుల లోకాన్ని నిర్మిద్దామని డాక్టర్ శ్రీగిరీష సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, క్షేత్ర స్థాయి పర్యవేక్షణ అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీగిరీష



టాపర్స్ వివరాలు ప్రకటిస్తున్న బార్ అసోసియేషన్ ధ్యక్షులు రాఘవరెడ్డి

టాపర్స్‌గా నిలిచిన మహిళా న్యాయవాదులు

ప్రజాశక్తి -కడప: కడప బార్ అసోసియేషన్ హాల్‌లో భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) శనివారం నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షలో మహిళా న్యాయవాదులే టాపర్స్‌గా నిలిచారని కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సి.సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, ఉపాధ్యక్షులు ఎ.ఉమాదేవి ప్రకటించారు. శనివారం కడపలోని 25 మంది యువ న్యాయవాదులు మోడల్ పరీక్ష రాసినట్లు తెలిపారు. మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో 100 ప్రశ్నలకు 100 మార్కులకు గాను మహిళా న్యాయవాదులు ఎం. మీనాక్షి 95, బి.జుబేదా 92, ఎం.స్పందన 91, కె.సునీత 85, ఎస్.ప్రవల్లిక 84, ఎస్.అస్మతియా 83 మార్కులు సాధించారని ఐఎఎల్ నాయకులు ప్రకటించారు. అంతకుముందు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవరెడ్డి ప్రశ్న పత్రాన్ని విడుదల చేశారు. సేవా భావంతో రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను భారత న్యాయవాదుల సంఘం నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. మోడల్ పరీక్షలో తక్కువ మార్కులు వచ్చాయని ఎవరు నిరుత్సాహ పడకూడదని పట్టుదలతో మరింతగా కృషి చేయాలని సూచించారు. మోడల్ పరీక్ష నిర్వహణలో సీనియర్ న్యాయవాది సంపత్ కుమార్ పాల్గొని జూనియర్ న్యాయవాదులకు సూచనలు సలహాలు ఇచ్చారు. మోడల్ పరీక్ష నిర్వహణలో కడప బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, మునికుమార్‌రెడ్డి, ఐఎఎల్ న్యాయ వాదులు ఆర్.జగదీశ్వర్‌రెడ్డి, కె.సూర్యనారాయణరెడ్డి, అర్చన, సోనీ, రమ్య గీత పాల్గొన్నారు.

నేడు నెలనెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 144వ సదస్సును ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 144వ సదస్సులో 'సజీవ సంప్రదాయంగా వేమన' అనే అంశంపై తెలుగు భాషా సేవకులు స.వెం.రమేశ్ (శ్రీకాళహస్తి) ప్రసంగిస్తారని తెలిపారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న ప్రభుత్వం

- వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: బనకచర్ల పేరుతో గేమ్ చేంజర్ అంటూ ప్రభుత్వం ఉదర గొడుతోందని, లక్షల కోట్లు అప్పులు తెచ్చి స్వంత లాభం కోసం కేవలం అమరావతిపై ఖర్చుపెడుతున్నారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటిలోని వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు బనకచర్ల అనే కొత్త సినిమా చూపిస్తానంటున్నాడని, అది అట్టర్ ఫ్లాప్ అవుతుందని తెలిసినా రాయలసీమ ప్రజలను ఉరించడానికే ప్రణాళిక సిద్ధం చేసుకోన్నారని చెప్పారు. క్లాప్ ఎప్పుడూ కొట్టేది లేదు.. ఆ సినిమా హిట్ అయ్యేది లేదన్నారు. కోట్లు ఖర్చు పెట్టి గాలేరు, నగరి హంద్రీ-నీవా పెండింగ్ పనులు పూర్తి చేస్తే ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. గండికోట రిజర్వాయర్ నుంచి కాలేటివాగు మీదుగా చేపట్టిన ప్రాజక్టు ద్వారా ప్రతి ఇంటికి కులాయి పథకాన్ని తాము ప్రారంభిస్తే ఇప్పటివరకు ఈ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లలేదని ఆరోపించారు. రాష్ట్రానికి రాజధాని అవసరమే, అమరావతికి తాము వ్యతిరేకం కాదని, మిగిలిన ప్రాంతాలను గాలికోది లేయడాన్ని ప్రశ్నిస్తున్నామని తెలిపారు. అమరావతి పేరుతో లక్షల కోట్లు దోచుకోంటున్నారని, వాటిని నిలదిస్తున్నామన్నారు. రాయల సీమలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు తరలించుకు పోవడం సరైంది కాదన్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదన్నారు. ఎన్‌టిఆర్ మండల వ్యవస్థ తీసుకొచ్చారని, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, ఉచిత కరెంట్ తీసుకోచ్చారని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి లక్ష నుంచి రెండు లక్షల వరక సంక్షేమాన్ని అందించేందుకు సచివాలయ వ్యవస్థ, ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు విలేజ్ క్లినిక్, రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ రాయితీలు కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలు తెచ్చారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహ్మాన్, కౌన్సిలర్ గౌస్‌ఖాన్, ఈశ్వర్ ప్రసాద్, జానం రవీం ద్ర, అల్తాఫ్, పట్టణ అధ్యక్షులు నవాజ్ అలీ, మైనారిటీ విభాగం అధ్య క్షుడు ఖలీల్ బేగ్, వైసిపి నాయకులు ఎస్ రియాజ్, శివ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి



కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం, గ్రామస్తులు

బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-కలికిరి

బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు పి.కుమార్‌యాదవ్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. వాల్మీకిపురం మం డలం, గండబోయినపల్లి పంచాయతీ, కొత్త కరువపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఎనిమిదేళ్లు పనిచేసి, అక్కడ విద్యార్థులను పాఠశాలను ఎంతో అభివృద్ధిలో నడిపించారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని కుమా రయ్య బదిలీ కావడం పట్ల గ్రామస్తులతో పా టు విద్యార్థులు కూడా భావోద్వే గానికి లోన య్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు పూలహారం వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 8 సంవత్సరా లుగా ఇక్కడ విధులు నిర్వర్తించి విద్యా ర్థులతో పాటు తల్లిదండ్రులతో ఎంతో అనుబంధంతో మెలిగి ఇప్పుడు బదిలీపై వెళ్లడం భాదకరంగా ఉందని అన్నారు. ఉద్యోగరీత్యా బదిలీలు సర్వసాధారణమేనని అన్నారు. గ్రామస్తులకు చూపించిన ఆప్యాయత మరువలేనిదని, భవిష్యత్తులో విద్యార్థులు మంచి చదువుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డిమోహన్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కృత్రిమ కాలుకు కొలతలు

ప్రజాశక్తి-పుల్లంపేట

జిల్లాలోని రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో చేతన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో తీసుకునే కృత్రిమ కాళ్ల కొలతలు కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కృత్రిమ కాళ్లు అవసరమైన విభిన్న ప్రతిభా వంతులు వచ్చి తమకు అవసరమైన కృత్రిమ కాలు కొలతలను అందించాలని విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ మల్లు సుబ్బ నరసారెడ్డి తెలిపారు. కొలతలు తీసుకున్న 15రోజుల తర్వాత ఆధునిక వెయిట్ లెస్ కృత్రిమ కాళ్లు అమర్చబడునని, కృత్రిమ కాళ్లు కావలసిన విభిన్న ప్రతిభా వంతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మేడికుర్తి వైద్యాధికారిగా డాక్టర్ ప్రసన్నలక్ష్మి

ప్రజాశక్తి-కలికిరి



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసన్న లక్ష్మి

మండల పరిధిలోని మేడికుర్తి సిహెచ్‌సి వైద్యాధికారిణిగా కె.ప్రసన న్నలక్ష్మి శని వారం బాధ్యతగా చేపట్టారు. గతంలో ఇక్కడ వైద్యాధికారిగా పని చేస్తున్న చిన్న రెడ్డప్ప బదిలీపై తరిగొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా రిజర్వుడు వైద్యాధికారిణిగా ఉన్న కె.ప్రసన్నలక్ష్మి బదిలీపై మేడికుర్తి సిహెచ్‌సికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం నుంచి అందవలసిన వైద్య సదుపాయాలు ప్రజల వద్దకు తీసుకెళ్తానని, ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్ల సహా యంతో ప్రజలందరికీ వైద్యం అందే విధంగా కృషి చేస్తానని అన్నారు.



ఎడిఎను సన్మానిస్తున్న నాలుగు మండలాల అధికారులు

ఎడిఎగా సుబ్రమణ్యం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు సబ్ డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకు లుగా సుబ్రహ్మణ్యం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు మునుపు ఎడిఎగా పనిచేసిన కవిత బదిలీపై వెళ్లడంతో ఆస్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని నాలుగు మండలాల్లో మండల వ్యవసాయ అధి కారుల సహకారంతో వ్యవసాయశాఖకు సంభందించిన అన్ని పథకాలు రైతులకి చేం ‌వేసి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికా రులు మల్లిక, శ్రీరాములు, సందీప్, శ్రీకర్, సుధాకర్ ఎడిఎకు స్వాగతం పలికారు.

'పంజం'కు పలువురు నివాళులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

వైసిపి సీనియర్ నాయకులు, జిల్లా మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి భౌతికాయానికి శనివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంతిమయాత్రలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివా సులు, మాజీ శాసనసభ్యులు సీని యర్ నాయకులు కొండూరు ప్రభావతమ్మ, కడప పార్లమెంట్ నియోజకవర్గ పరిశీల కులు కొండూరు అజయ్‌రెడ్డి, రక్కాసి ధనుంజయరెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, పుల్లం పేట ఎంపిపి ముద్దాబాబుల్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పంజం సందీప్‌రెడ్డి వైస్ ఎంపిపి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, సిడి.నాగేంద్ర యాదవ్, వైసిపి జిల్లా యూత్ అధ్యక్షులు వై.శివప్రసాద్ రెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, సిద్దయ్య, భరత్‌రెడ్డి, ఎంపీటీసీ బండారు మల్లికార్జున, పర్వత విజయకుమార్ రెడ్డి,వతలూరు సాయికిషోర్‌రెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పంజంసుకుమార్‌రెడ్డి భౌతిక కాయానికి కూటమి నాయకులు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారితోపాటు టివి.రమణారెడ్డి, వేమన సుబ్రహ్మణ్యం నాయుడు, గడికోట సుబ్బరాయుడు, వెంకట్రామరాజు, శివారెడ్డి, సుకుమార్‌రెడ్డి నివాళులర్పించారు.

రేపటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

మహిళా సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసు కోవాలని ఎంపిడిఓ భానుమూర్తిరావు తెలిపారు. సోమవారం నుంచి కలికిరి సిఎల్‌ఆర్‌సి భవనంలో నియోజకవర్గంలోని మహిళా సర్పంచులకు గ్రామ పంచాయతీల అభివృద్ధి పై రిసోర్స్ పర్సన్లచే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని కలికిరి, కలకడ, వాల్మీకిపురం, గుర్రంకొండ, కె.వి.పల్లి, పీలేరు మండలాల్లో ఎన్నికైన మహిళా సర్పంచులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పక పాటించాలని స్థానిక సీఐ మోహన్ పేర్కొన్నారు. శనివారం బస్టాండ్ కూడలిలో ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానా, కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు ఆలోచించాలని సిఐ సూచించారు.

వేంపల్లె : వాహనాలకు సరైన పత్రాలు లేకపోతే అలాంటి వాహనాలను సీజ్ చేస్తామని సిఐ నర్సింహులు తెలిపారు. స్థానిక పులి వెందుల బైపాస్‌లో వాహనాలను సిఐ తనిఖీ చేశారు. సరైన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వారికి జరిమానాలు విధించారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వాహనాదారులు సహకరించాలని కోరారు. హెల్మెట్ పెట్టుకొంటే ప్రాణప్రాయం నుండి బయట పడేందుకు వీలుంటుందన్నారు.

పేదల ఊటీని దూరం చేస్తే సహించం

ప్రజాశక్తి-బి.కొత్తకోట



హార్సిలీహిల్స్‌ను సందర్శిస్తున్న కాంగ్రెస్, సిపిఐ నాయకులు

పేదల ఊటీగా ప్రసిద్ధిగాంచిన హార్సిలీహిల్స్‌ని కాంగ్రెస్, సిపిఐ పార్టీ నాయకులు శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత ప్రజలకు హార్సిలీహిల్స్ ఆంధ్ర ఊటీ అని, ప్రకృతి సౌందర్యాన్ని వీక్షించడానికి, ప్రకృతి ఒడిలో సేదతీరడానికి పర్యాటకులు తరచూ ఈ ప్రాంతానికి వస్తుంటారని అన్నారు. ఈ కొండపైన సహజ వనరులు, అటవీ సంపద అపారంగా ఉందని గుర్తు చేశారు. శ్రీ గంధానికి పుట్టినిల్లని, ఇంతటి సౌందర్యమైన ప్రాంతాన్ని 18వ శతాబ్దంలోనే బ్రిటిష్ ప్రభుత్వం గుర్తించి అభివృద్ధి చేసిందని అన్నారు. చరిత్ర కలిగిన హార్సిలీహిల్స్‌ని పతాంజలి అనే కార్పొరేట్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడం సరైన పద్ధతి కాదన్నారు.ఈ ప్రాంతంలో 95 శాతం శ్రమజీవులు, రైతులు నివసిస్తున్నారని అంతర్జాతీయ యోగా కేంద్రం అభివృద్ధి చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండ దన్నారు. కార్పొరేట్ యజమాను లకు, పెద్దపెద్ద సెలబ్రిటీలకు పార్టీలు నడుపుకోనే కేంద్రంగా మారుతుందే తప్ప ప్రజలకి ఎలాంటి ఉపయోగం లేదన్నారు. యోగా కేంద్రం అభివృద్ధి కావడం వల్ల ప్రజల ఆరోగ్యం ఎంత మేరకు మెరుగు పడదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలను ప్రభుత్వమే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తే పేదలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వం కార్పోరేట్ విధానా లను అవలంబిస్తూ ప్రజల ఆస్తులను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే పనిలో ఉందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన ఆలోచన మార్చుకోవాలన్నారు. పతాంజలి కంపెనీకి హార్సిలీహిల్స్‌ను అప్పగించే ప్రయ త్నం ఆపకపోతే ప్రజా అగ్రహం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మనోహర్ రెడ్డి, మురళి,తంబయ్యశెట్టి పాల్గొన్నారు.

నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోండి



గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న డాక్టర్ విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గొర్రెలు, మేకలు కలిగిన పాడి రైతులు నట్టల నివారణ మందు లను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఉన్న 85 వేల గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. శనివారం కన్నె మడుగులో 450 గొర్రెలు, 34 మేకలకు నట్టల ని వారణ మందు తాపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా గొర్రెలు, మేకలు పలు రకాల వ్యాధుల బారిన పడడం వలన, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతుల బాధలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాలలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ముందస్తుగా జూన్ నెల 26వ తేదీ నుంచి జూలై నెల 10వ తేదీ వరకు నట్టల నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జీవాలకు మేత లభ్యం కానప్పుడు, పోషకాల లోపం ఏర్పడినప్పుడు, వానకాలం, అనావృష్టి సందర్భాలు, అంటు వ్యాధులు ప్రబలిన సమయాల్లో ఈ పరాన్న జీవుల బెడద అధికంగా ఉంటుందని అన్నారు. నట్టలు జీవాల్లో పోషక పదార్థాలను, రక్తాన్ని స్వీకరించి రక్తహీ నతకు గురిచేస్తాయని అన్నారు. తరచూ విరేచనాలు కావడం, ఆకలిలేమి, పొట్ట కిందికి జారి ఉండడం, దవడల మధ్య నీరు చేరడం తదితర లక్షణాలు కనిపిస్తాయి.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ అధికారులు ముందస్తుగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. పశు యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మందులను తప్పనిసరిగా క్రమపద్ధతిలో తాగిం చాలని సూచించారు. కార్యక్రమంలో రమేష్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : డిసిహెచ్‌ఎస్

ప్రజాశక్తి-తంబళ్లపల్లె



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఆంజనేయులు

గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఆంజనేయులు తెలిపారు. శనివారం స్థానిక సిహెచ్‌సి ప్రభుత్వాసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలోని ల్యాబ్, ఎక్స్‌రే వెటర్నటీ విభాగం, ఆపరేషన్ థియేటర్, వార్డులు పరిశీలిం చారు. డాక్టర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజలకు అత్యవసర సమ యాలలోనూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని మెడికల్ ఆఫీసర్ తేజస్వినికి సూచించారు. ఆసుపత్రికి వచ్చే ఒపి రోగులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ఆస్పత్రిలో జరిగే ప్రసవాలు తదితరా అంశాలపై ప్రశ్నించి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం చేయరాదని ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే తగు చర్యలు తప్పవని సూచించారు. ఆయన వెంట డాక్టర్లు విక్రాంత్ రెడ్డి, మహేష్, రాజు, హెడ్ సిస్టర్ గ్లోరీ లిటిల్ ఫ్లవర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ టోర్నమెంట్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ అందుకుంటున్న అనిల్

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ ఆరవ పల్లిలోని నందలూరు జడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో అరవపల్లి క్రికెట్ లీగ్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహిస్తున్న టోర్నమెంట్ లోని మ్యాచ లు శనివారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన మ్యాచ్ లో పాటూరు జట్టుపై చింతరాజుపల్లె విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన చింతరాజు పల్లె జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్లను పోయి 111పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన పాటూరు జట్టు 12 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి పరాజయం చెందింది. విజేత జట్టు ఆటగాడు శీను 3వికెట్లు తీయడంతో పాటు 29 పరు గులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్లో కుమ్మర పల్లె జట్టుపై ఉదయ్ 11 ఇసుకపల్లె జట్టు విజయం సాధించింది. ముందు బ్యాటింగ్ చేసిన ఇసుక పల్లె జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 114 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కుమ్మరపల్లె జట్టు 7ఓవర్లలో 37 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. ఇసుక పల్లె జట్టు ఆటగాడు అనిల్ 4 వికెట్లను తీసి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. కార్యక్రమంలో అరవపల్లె క్రికెట్ లీగ్ సభ్యులు అరుణ్, బుల్లెట్ హరి, నవీన్, రాము, క్రీడాకారులు పాల్గొన్నారు.

అర్హులకు రుణాలు అందించండి : బివైఎస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మున్సిపల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న బివైఎస్ నాయకులు

వెనుకబడిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న రుణాలను అర్హులకు వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్యాలయం వద్ద బహుజన యువసేన బివైఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ కులాలు, సంఘాలు రంగాలలో బలహీనవర్గాల ఆర్థిక అభివృద్ధి కొరకు, ఆర్థిక సహాయం అందించాలని సదుద్దేశంతో కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటి ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. అంతటి మంచి ఉద్దేశంతో ప్రారంభించిన కార్పొరేషన్ రుణాలు మదనపల్లెలో మాత్రం అర్హత కలిగిన సామాన్య ప్రజలు, బలహీన వర్గాల ప్రజలకు అందకుండా కేవలం అధికార పార్టీ నాయకులు సిఫార్సు చేసిన వారి పేర్లను మాత్రమే జాబితాలో చేర్చి పంపుతు న్నారని ఆరోపించారు. సాధారణంగా దరఖాస్తు చేసుకున్న అనంతరం దరఖాస్తుదారులు అందరినీ ఇంటర్వ్యూల పేరుతో పిలిపించి, అక్కడ సెలక్షన్ చేస్తామంటూ గోల్మాల్ చేస్తూ దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరైన వారి జాబితాను అధికార పార్టీ నాయకులకు పంపిస్తే ఆ జాబితాలో అధికార పార్టీ నాయకులు ఎవరి పేర్లను అయితే సిఫార్సు చేస్తారో వారి పేర్లు మాత్రమే మెప్మా అధికారులు పైవారికి పంపిస్తున్నారన్నారు. అంత మాత్రాన దరఖాస్తులుల, ఇంటర్వ్యూలు అంటూ హడావడి ఎందుకని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నారా లోకేష్ మాత్రం కూటమి ప్రభుత్వంలో బలహీనవర్గాల, సామాన్య ప్రజలందరికీ కార్పొరేషన్ రుణాలు అంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని చెబుతుంటే, మదనపల్లెలో మాత్రం అందుకు భిన్నంగా వారి నాయకులు చేస్తున్నారని, సామాన్య ప్రజలు, బలహీ నవర్గాల వారికి ఇక్కడ జరుగుతున్న గోల్మాల్ తెలియక ఎంతో ఆశతో రుణాలు మంజూరు అవుతాయని, ఐదారు రోజులు పాటు పనులు మాను కొని, రుణాలు దరఖాస్తు కోసం కావలసిన సర్టిఫికెట్లకు డాక్యుమెంట్లకు రూ.వేలకు వేలు ఖర్చు పెట్టుకుని నష్టపోతున్నారన్నారు. నిజమైన అర్హులకు అన్యాయం జరిగి నష్టపోతున్నారని, వారికి నష్టం జరగకుండా సాధారణ ప్రక్రియ ద్వారా నిజమైన అర్హులకు, న్యాయం జరిగేలాగా చర్యలు తీసు కోవాలని, లేనిపక్షంలో సిఫార్సు చేసిన వారిని ఎలాంటి ఎలిజిబిలిటీ క్రైటీ రియాతో సెలెక్ట్ చేశారో చెప్పాలని, నిజమైన అర్హులకు అన్యాయం జరిగితే లోకాయుక్త, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. కార్యక్ర మంలో బివైఎస్ నాయకులు హరికృష్ణ, జిలాని బాషా, పూర్ణచంద్ర, వినయ్, శశికుమార్, బాలకృష్ణ, రమేష్, సాయికిరణ్, అఖిల్, ద్వారక పాల్గొన్నారు.

అనుమతి లేని మందులు అమ్మితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

అనుమతి లేని మందులు, ఎరువులు రైతులకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మైదుకూరు ఎడిఎ కృష్ణమూర్తి హెచ్చరించారు. మైదుకూరు మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో శనివారం ఆయన స్థానిక మండల వ్యవసాయ అధికారి బలగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నగదు బిల్లును రైతులకు ఇవ్వాలని సూచించారు. కాలం చెల్లిన మందులు, విత్తనాలు దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఉంచరాదన్నారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను అప్డేట్ చేసి ఉంచాలని తెలిపారు. ధరల పట్టిక, స్టాక్ బోర్డ్‌ను ప్రతిరోజు ఏర్పాటు చేయాలని తెలిపారు. నిషేధించిన పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లో అమ్మకాలు చేపట్టకూడదన్నారు. లైసెన్స్ లేకుండా గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

బాలుర ఉన్నత పాఠశాలకు బెంచీలు వితరణ

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల చెన్నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి నరసింహ పాఠశాలకు రూ.40వేలు విలువ చేసే 15 బెంచీలు వితరణ చేశారు. దాత సోదరులు మైలవరం మండలం గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఓబులేసు, రాజశేఖర్, కళ్యాణ్‌కుమార్ బెంచీలు అందజేశారు. పూర్వ విద్యార్థి, దాత నరసింహ అమెరికాలో స్థిరపడి తను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూతనివ్వాలనే లక్ష్యంతో పాఠ శాలకు బెంచీలు వితరణ చేయడం సంతోషకరమని ప్రధానోపాధ్యాయులు ఓబులేసు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాబు మాధవరెడ్డి, ప్రసాద్, అన్వర్ బా షా పాల్గొన్నారు.



దేవునికడపలో పర్యటిస్తున్న టిటిడి జెఇఒ వీరబ్రహ్మం

ఆలయాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- టిటిడి జెఇఒ వీరబ్రహ్మం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి, ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవుని కడప, ఒంటిమిట్ట ఆలయాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన వేరువేరుగా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో త్వరలో జరుగనున్న బాలాలయం కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఆలయ గర్భాలయంలో పోటు గదిలో వర్షం నీరు లీకేజీలు లేకుండా చూడాలని, విద్యుత్ పాత వైర్లు తొలగించి కొత్త వైర్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గర్భాలయంలో పైభాగాన ఉన్న కాలం చెల్లిన కొయ్య దంతెలను తొలగించే అంశం, ఆలయంలో అవసరమైన గ్రానైట్ పనులు, పోటు పెంపు, పిఎసి వద్ద లిఫ్ట్ ఏర్పాటు, ఆలయం చుట్టూ రోడ్ల విస్తరణ, విలువైన వస్తువులు భద్రపరుచుకునేందుకు స్ట్రాంగ్ రూం ఏర్పాటు, భక్తులకు సౌకర్యవంతంగా పార్కింగ్, నూతన వాహన మండపం, తదితర మరమ్మతుల పనులపై నివేదిక తయారు చేయాలని అధికారులను కోరారు. పుష్కరిణి వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్పోరేషన్ అధికారులకు సూచించారు. అనంతరం ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి వారి ఆలయం పరిసరాలలో జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరింతగా అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కల్యాణ వేదిక వద్ద భక్తులకు కనిపించేలా శంఖు, చక్రాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులను ఆకట్టుకునేలా ఆలయం సమీపంలో 27 నక్షత్రాలు, చెట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఒంటిమిట్ట ఆలయ పరిధిలో పెండింగ్ లో ఉన్న ఇంజనీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప మునిసిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, ఎస్ఇ (ఎలక్ట్రికల్) వేంకటేశ్వర్లు, డిప్యూటీ ఇఒలు నటేష్ బాబు, ప్రశాంతి, ఇఇలు నాగరాజు, సుమతి, పలువురు అధికారులు, ఆలయాల అర్చకులు, ఆలయ ఇన్ స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

4న నందలూరు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-నందలూరు

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన జులై 4న ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ రాధాకృష్ణన్ తెలిపారు. ఈ సమావేశానికి జడ్‌పిటిసి సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, కో-ఆప్షన్‌సభ్యులు , గ్రామ సర్పంచులు, మండల అధికారులు తప్పక హాజరు కావాలని అన్నారు.

డ్రాగా ముగిసిన కడప, కర్నూల్ మ్యాచ్

ప్రజాశక్తి - కడప

ఎసిఎ సౌత్ జోన్ అండర్ -19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, కర్నూలు జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 765 పరుగులు చేసింది. ఒక వికెట్ నష్టానికి 14 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 97.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 331 పరుగులు చేసింది. ఆ జట్టులోని విష్ణువర్ధన్ నాయుడు 100 పరుగులు(సెంచరీ) చేసి నాటౌట్ గా నిలిచాడు. సాయి గణేష్ 72 పరుగులు చేశాడు. కడప జట్టులోని శివ శంకర 3, ఆర్థిత్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కెఓఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై అనంతపురం జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ లో మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 212 పరుగులు చేసింది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 524 పరుగులు చేసింది. మూడు వికెట్లు నష్టానికి 173 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు గట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 99.2 ఓవర్లలో 405 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 135 పరుగులు (సెంచరీ) చేశాడు. షావుల్ హమీద్ 89 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని సాయి ప్రతాప్ రెడ్డి 3, వీరారెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు రెండవ రోజు ఆటో సమయానికి 24.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 94 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.



తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా యువకుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మదనపల్లె-కర్ణాటక సరిహద్దులోని బార్డర్ చెక్ పోస్టు వద్ద జరిగింది. మదనపల్లె తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. ప్రకాశం జిల్లా, పెద్దచెర్లోపల్లి మండలం, మురగామి గ్రామంలోని మురుగుమ్మివీధిలో నివాసం ఉంటున్న పెద్దిరెడ్డి ఎరుకలయ్య కుమారుడు వీరారెడ్డి(32) ద్విచక్ర వాహనంలో బెంగు ళూరుకు బయల్దేరాడు. మార్గమధ్యంలోని మదనపల్లె సరిహద్దులోని బార్డర్ చెక్‌పోస్టు వద్ద కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరారెడ్డి తీవ్రంగా గాయపడగా వాయల్పాడు 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యా పిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తన భార్య, పిల్లలతో అదృశ్యమైందని పట్టణంలోని స్థానిక బిసి కాలనీలో నివాసముండే వాసు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 14ఏళ్ళ క్రితం సునీలని వివాహం చేసుకున్నానని, తమకు కుమారుడు సందీప్, కుమార్తె కీర్తిక ఇద్దరు సంతానం ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 27న ఉదయం సొంత పనుల నిమిత్తం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాత్రి 7.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా తన భార్య, పిల్లలు కనిపించలేదని తెలిపారు. తన సోదరుడు ఆంజనేయులు ఇద్దరూ కలిసి బి.కొత్తకోట చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతకగా వారి ఆచూకీ లభించ లేదని అన్నారు. శనివారం బి.కొత్తకోట పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడు వాసు ఫిర్యాదు మేరకు భార్య, పిల్లల అదృశ్యంపై మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.